సాక్షి విశాఖపట్నం

శనివారం । 17 । జూన్ । 2023



నిండు కుండలా.! 8లో

వేసవిలోనూ ముడసర్లోవ రిజర్వాయర్ నీటితో కళకళలాడుతోంది. శుక్రవారం నాటికి 163 అడుగుల నీరు నిల్వ ఉంది.



దులీప్ ట్రోఫీకి మనోళ్లు.. 8లో

దులీప్ ట్రోఫీకి నలుగురు ఆంధ్రా ఆటగాళ్లు సౌత్‌జోన్ జట్టులో స్థానం సంపాదించారు. వీరిలో ముగ్గురు విశాఖ ఆటగాళ్లు ఉన్నారు.



నిర్మానుష్యంగా రైల్వే స్టేషన్

పలు రైళ్లు రద్దు కావడంతో విశాఖ రైల్వే స్టేషన్ శుక్రవారం బోసిపోయింది. ప్లాట్‌ఫారాలు ఖాళీగా కనిపించాయి. 8లో

న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తికి అప్పన్న జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తారా వితస్త గంజు దర్శించుకున్నారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. వేద ఆశీర్వచనం అందించారు. న్యాయమూర్తికి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికను ఏఈవో నరసింహరాజు అందజేశారు.

డ్రోన్ టెక్నాలజీలో ఉపాధి అవకాశాలు



డ్రోన్‌టెక్నాలజీపై చర్చిస్తున్న ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు

మురళీనగర్: విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీ శిక్షణ ఇవ్వడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవచ్చని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు అన్నారు. ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ టెక్నాలజీపై కాలేజీ వివిధ బ్రాంచీల డిపార్టుమెంట్ హెడ్‌లకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సులో చేరడానికి ఆసక్తి చూపే విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీలో సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించడానికి ఏయూ ఐసీడీటీ ముందుకు వచ్చినట్లు చెప్పారు. దీనిపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తామని ఐఎస్‌టీడీ సీఈవో ఎస్‌కే వెంకటసతీష్, చైర్మన్ వోఎంరావ్ చెప్పారు. కార్యక్రమంలో వివిధ డిపార్టుమెంటు హెడ్‌లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 89 మంది ఎంపిక



అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న ఎంప్లాయిమెంటు అధికారులు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. ట్రస్ట్ సర్వీసెస్, శ్రీరామ్‌చిట్స్, శరణ్‌మోటార్స్, జీ4 సెక్యూరిటీ, పాబ్లోట్రాన్స్‌పోర్ట్, దసపల్లా హోటల్స్, ఎస్‌బీఐ కార్డ్స్, ఆన్‌లైన్ గ్రోసరీ, అదానీ ఫౌండేషన్, అపోలో ఫార్మసీ తదితర కంపెనీల్లో 355 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 169 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 89 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏ.సంగీత, ఆయా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంప్రదాయేతర కోర్సులతో ఉపాధి అవకాశాలు



గైస్ డిపార్టుమెంట్స్ హెడ్‌ల సమావేశంలో మాట్లాడుతున్న ఓఎం రావ్

మురళీనగర్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సంప్రదాయేతర కోర్సులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఏయూ ఐసీడీటీ ఇన్నోవేషన్ కేంద్రం సీనియర్ వైస్ చైర్మన్ డాక్టర్ ఓఎం రావ్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన డిపార్టుహెడ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్నోవేటివ్ కోర్సులపై విద్యార్థులు అవగాహన కల్పించి శిక్షణ కార్యక్రమాలు అందించేందుకు ఏయూ ఐసీడీటీ కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం డిమాండు ఉన్న కొత్త కోర్సులను విద్యార్థులకు పరిచయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎస్‌డీడీ లైఫ్ మెంబర్ వెంకట సతీష్, కాలేజీ డిపార్టుమెంట్ హెడ్‌లు పాల్గొన్నారు.

‘ఫ్రై’ డే!

- అట్టుడికిన విశాఖ
- విశాఖలో 44.4 డిగ్రీలు.. అనకాపల్లిలో 46.1
- ఈ వేసవిలో 46 డిగ్రీలు దాటడం ఇదే తొలిసారి
- నేడు మరింత తీవ్ర వడగాడ్పులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు





శీతలపానీయాలతో సేదతీరుతూ..



మండుటెండలో...

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉష్ణతాపం రికార్డులు సృష్టిస్తోంది. మూడు వారాల పైనుంచి అట్టుడికిస్తూనే ఉంది. జనం వర్షాల కోసం తపిస్తున్న తరుణంలో నిప్పుల వాన కురుస్తోంది. తాజాగా శుక్రవారం మరింత తీవ్రరూపం దాల్చింది. ఫ్రైడే ‘ఫ్రై’ డేగా మారింది. అనకాపల్లి పట్టణంలో మునుపెన్నడూ లేనివిధంగా తొలిసారిగా 46.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఇటీవల కాలంలో ఇంతటి గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రత నమోదు కాకపోవడం విశేషం. విశాఖ జిల్లాతో పాటు అనకాపల్లి జిల్లాలో పలుచోట్ల ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు పైనే నమోదయ్యాయి. విశాఖ నగరంలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయి మరోసారి నగరాన్ని ఉడికించింది. ఇది సాధారణంకంటే 9.5 డిగ్రీలు అధికం. ఈనెల 10న విశాఖలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 28 ఏళ్ల తర్వాత నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇది. వారం రోజుల తర్వాత శుక్రవారం నగరంలో మళ్లీ అదే స్థాయిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఇలా ఇటు విశాఖ నగరంలోనూ, జిల్లాలోనూ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోనూ 42–46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదై జనాన్ని బేజారెత్తించాయి. ఉదయం నుంచే సూర్యప్రతాపం చూపడం మొదలైంది. మధ్యాహ్నానికి మరింత తీవ్రరూపం దాల్చడంతో వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు వీచాయి. రాత్రి ఏడు గంటలు దాటినా వాతావరణం చల్లబడకుండా వేడి గాలులు కొనసాగుతూనే ఉన్నాయి.

శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీలలో)

అనకాపల్లి	46.10
ఎయిర్‌పోర్టు	44.40
అక్కిరెడ్డిపాలెం	44.38
ములగాడ	44.01
సింహాచలం	43.20
భీమిలి	43.00
గాజువాక	43.00

నేడు మరింత తీవ్రం

మరోవైపు శనివారం ఉష్ణోగ్రతలు మరింత ఉగ్రరూపం దాల్చనున్నాయి. ఫలితంగా పలుచోట్ల వడగాడ్పులు, కొన్ని చోట్ల తీవ్ర వడగాడ్పులు, అక్కడక్కడ అత్యంత తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశాలున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. అందువల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, నీరు, ద్రవ పదార్థాలు ఎక్కువగా సేవించాలని సూచించింది. ఉమ్మడి విశాఖలో మరో మూడు రోజులు వడగాడ్పుల ప్రభావం ఉంటుందని తెలిపింది.

కూత పెట్టిన టాయ్ ట్రైన్



ట్రైన్‌లో సందర్శకులతో పాటు కలెక్టర్ మల్లికార్జున, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

- కైలాసగిరిపై పునఃప్రారంభం
- రైలులో ప్రయాణించిన కలెక్టర్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్

ఆరిలోవ: నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిపై విశాఖ దర్శన్ టాయ్ ట్రైన్ (సర్క్యూట్ ట్రైన్) మళ్లీ అందుబాటులోకి వచ్చింది. సుమారు నెల రోజుల క్రితం నిలిచియిన ఈ ట్రైన్ కూత కైలాసగిరిపై మళ్లీ మార్మోగింది. కలెక్టర్, మెట్రో పాలిటిన్ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల శుక్రవారం పునఃప్రారంభించారు. ఈ ట్రైన్ నిర్వాహకుడు నుంచి కొన్నాళ్లుగా వీఎంఆర్‌డీఏకు చెల్లించాల్సిన రెవెన్యూ బకాయిలు ఉండిపోవడంతో నెల రోజుల క్రితం అధికారులు ఈ ట్రైన్‌ను నిలిపేశారు. దీంతో ఇక్కడకు వెళ్లిన సందర్శకులకు సరదా లేకుండా పోయింది. వారి కోరిక మేరకు ట్రైన్‌ను వీఎంఆర్‌డీఏ అధికారులు శుక్రవారం సాయంత్రం అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో సందర్శకులు ఎప్పటిలాగే సరదాగా విహరించారు. సందర్శకులతో పాటు కలెక్టర్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, ఇతర అధికారులు ట్రైన్‌లో కైలాసగిరిపై చుట్టూ తిరిగి అందాలను వీక్షించారు.



ట్రైన్‌కు జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల

తెన్నేటి పార్కులో మరిన్ని సౌకర్యాలు

దొండపర్తి(విశాఖ దక్షిణ): తెన్నేటి పార్కులోను, కైలాసగిరి ఎరీనాలో పర్యాటకులకు సౌకర్యార్థం మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన తెన్నేటి పార్కు, కైలాసగిరి ఎరినాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

తెన్నేటి పార్క్‌లో మెరుగైన పచ్చికలు, సందర్శకులకు వినియోగార్థం చెట్ల నీడలో బెంచీలు, మరుగుదొడ్లు, మరింత పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని అధికారులకు చెప్పారు. అదేవిధంగా కైలాసగిరి హెల్త్ ఎరీనాలో వాకింగ్ ట్రాక్, మెడిటేషన్ పాయింట్లు, ఇతర సౌకర్యాలను తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాలను మరింత ప్రజాప్రయోగ కరంగా తీర్చిదిద్దాలని సూచించారు. పలువురు వాకర్లతో మాట్లాడి హెల్త్ ఎరీనా అభివృద్ధికి వారి సూచనలు స్వీకరించారు. తదనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. హెల్త్ ఎరీనా ప్రాంతంలో రాత్రి సమయంలో రక్షణ కోసం పోలీస్ గస్తీ నిర్వహణకు పోలీస్ కమిషనర్‌కు రాతపూర్వకంగా కోరాలని వీఎంఆర్‌డీఏ కార్యదర్శి రంగయ్యకు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పూరీ రథయాత్రకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): పూరీలో జరగనున్న రథయాత్ర సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ -పూరీ-విశాఖ మధ్య పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు

విశాఖ-పూరీ (08901) స్పెషల్ విశాఖలో ఈ నెల 19, 27తేదీలలో మధ్యాహ్నం 2.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు (ఆదేరోజు మధ్య రాత్రి) 1.15 గంటలకు పూరీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరీ-విశాఖ (08902) స్పెషల్ పూరీలో ఈ నెల 20,28 తేదీలలో రాత్రి 10.55గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.30గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు సింహాచలం, పెందుర్తి, కొత్తవలస, కంటకాపల్లి, అలమండ, కోరుకొండ, విజయనగరం, నెల్లిమర్ల, గరివిడి, చీపురుపల్లి, సిగడాం, పొందూరు, దూసి, శ్రీకాకుళం రోడ్, ఉర్లాం, తిలారు, కోటబొమ్మాళి, నౌపడ, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం, బ్రహ్మపూర్, చత్రపూర్, ఖల్లికోట్, బలుగాం, నిరాకాపూర్, హరిపురం, మోటారి, కనాస్ రోడ్ పీహెచ్, డేలాంగ్, జెనాపూర్ రోడ్ పీహెచ్, బీర్ పురుషోత్తం పూర్, సఖిగోపాల్, జనకిదైపూర్ పీహెచ్, మలతిపత్‌పూర్ స్టేషన్‌లలో ఆగుతాయి. 1-థర్డ్ ఏసీ, 3-స్లీపర్ క్లాస్, 10 -జనరల్ సెకండ్ క్లాస్, 2-లగేజి కం బ్రేక్ /దివ్యాంగ కోచ్‌లతో నడుస్తాయి.

అక్రమ భవన నిర్మాణాలపై ఫిర్యాదు చేయండి

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమానికి మూడు ఫిర్యాదులు అందాయి. పట్టణ ప్రణాళిక అధికారి సునీత ఫిర్యాదులు స్వీకరించారు. ఓపెన్ ఫోరంలో జోన్-2 నుంచి ఒకటి, జోన్-4 నుంచి ఒకటి, జోన్-5 నుంచి ఒక ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని 8 జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించినా, భవన నిర్మాణ వ్యర్థాలపైన, టౌన్ ప్లానింగ్ విభాగంపై జీవీఎంసీ టోల్‌ఫ్రీ నంబరు 1800 4250 0009, టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఏర్పాటు చేసిన 81878 97569కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చునని సునీత తెలిపారు. పేరు, డోర్ నంబరు, వార్డు నంబరు, చిరునామా, సమస్య వివరాలను ఆ వాట్సప్‌కు పంపినచో సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా సత్వర చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న టౌన్ ప్లానింగ్ డీసీపీ

23 నుంచి ‘జగనన్న సురక్ష’

- ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మల్లికార్జున



తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జోనల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జేసీ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

మహారాణిపేట(విశాఖ దక్షిణ): జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు ‘జగనన్న సురక్ష’కు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. శుక్రవారం సాయంత్రం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జోనల్ కమిషనర్లతో జగనన్న సురక్ష కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడం, అర్హులకు తప్పనిసరిగా పథకాలు మంజూరు చేయడమే లక్ష్యంగా ఈ నెల 23 నుంచి జులై 23వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. తొలిదశలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష గురించి వివరించాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్ ఒక బృందంగా ఏర్పడి గ్రామాల్లో పర్యటించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్లు ఒక బృందంగా ఏర్పడి వార్డుల్లో పర్యటించాలని చెప్పారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. జనన, మరణ, కుల, వివాహ ధ్రువపత్రాల మంజూరు నుంచి ప్రభుత్వ పథకాలు పొందడం వరకు ఏమైనా సమస్యలుంటే నిశితంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. నిర్దేశిత తేదీల్లో మండల స్థాయి అధికారులు ఆయా గ్రామాల్లో సచివాలయాలను సందర్శించి అర్హులుగా గుర్తించిన వారిని సచివాలయాల వద్దకు ఆహ్వానించి వారికి అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు అదే రోజు అందజేయాలన్నారు. ప్రతి రోజు జరిగిన ప్రక్రియను గ్రామ, వార్డు సచివాలయాల పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. శనివారం నుంచి సచివాలయాల సిబ్బందికి ఈ కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు భాస్కరరెడ్డి, హుస్సేన్ సాహెబ్, డీఎల్‌డీవో పూర్ణిమా దేవి, జోనల్ కమిషనర్లు, తహసీల్దార్లు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేర్‌హౌసింగ్ లావాదేవీల్లో 265 శాతం వృద్ధి

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం డివిజన్ ఈ ఏడాది వేర్‌హౌసింగ్ లావాదేవీల్లో 265 శాతం వృద్ధి సాధించింది. ఈ మేరకు నైట్‌ఫ్రాంక్ ఇండియా, అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టెన్సీ శుక్రవారం మార్కెట్ రిపోర్టును విడుదల చేశాయి. ఆ నివేదిక ప్రకారం 2023 ఆర్థిక సంవత్సరంలో 1.22 మిలియన్ చదరపు అడుగుల గిడ్డంగుల లావాదేవీలను నమోదు చేసినట్టు పేర్కొంది. 2022 ఆర్థిక సంవత్సరంలో 0.34 మిలియన్ చదరపు అడుగుల లావాదేవీలను నిర్వహించింది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ వృద్ధి 265 శాతం అధికమని తెలిపింది. విశాఖలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్, షిప్ బిల్డింగ్, థర్మల్ ఎనర్జీ, ఆయిల్, పెట్రోలియం, స్టీల్ ఫ్యాబ్రికేషన్ వంటి భారీ పరిశ్రమలున్నాయి. లావాదేవీల క్లస్టర్ విభజనకు సంబంధించి గాజువాక ఆటోనగర్, మధురవాడ క్లస్టర్లున్నాయి. వీటిలో గాజువాక ఆటోనగర్ క్లస్టర్ 2023 ఆర్థిక సంవత్సరంలో 29 శాతం, మధురవాడ క్లస్టర్ 71 శాతం గిడ్డంగుల లావాదేవీలు నిర్వహించాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో భూముల ధరలు స్థిరంగా ఉండగా, గిడ్డంగుల అద్దెలు స్వల్పంగా పెరిగాయి.

కిడ్నాప్ కేసు ఛేదనలో పోలీసుల స్పందన భేష్

- ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్‌పై మంత్రి అమర్‌నాథ్ స్పందన



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుమారుడు, భార్యతో పాటు ఆడిటర్ జీవీ కిడ్నాప్ ఘటనను ఛేదించడంలో పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఈ కిడ్నాప్ సంఘటనపై విలేకరుల అడిగిన ప్రశ్నలకు స్పందించారు. కిడ్నాప్ అయినట్టు సమాచారం అందిన వెంటనే పోలీసు యంత్రాంగం అప్రమత్తమైందన్నారు. సమర్థవంతంగా పనిచేసి సమాచారం అందుకున్న కొన్ని గంటల్లోనే నిందితులను పట్టుకొన్నారన్నారు. కిడ్నాప్ ఘటనతో ప్రభుత్వ వైఫల్యం మరోసారి బయటపడిందంటూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలపై విలేకరులు ప్రశ్నించగా చంద్రబాబు కళ్లతో చూస్తే అంతా వైఫల్యంగానే కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. కిడ్నాప్‌నకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇలాంటి సమస్య సామాన్యుడికి ఎదురైనా యంత్రాంగం ఇదే స్థాయిలో స్పందిస్తుందన్నారు. రౌడీషీటర్లతో పాటు నేర కార్యకలాపాలు నియంత్రించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. రౌడీషీటర్లపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు.

నిర్మాణ రంగానికి ప్రభుత్వ సహకారం



ఎక్స్‌పోను తిలకించేందుకు వచ్చిన నగర వాసులు



ఎక్స్‌పోను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

ఎంవీపీకాలనీ: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలస్‌లో కనెక్ట్ ఎక్స్‌పో 2023కు విశేష స్పందన లభించింది. శుక్రవారం రాష్ట్ర పారిశ్రామిక శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ ఎక్స్‌పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1978 నుంచి బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అభివృద్ధికి అందిస్తున్న సేవలను కొనియాడారు. నిర్మాణ రంగానికి ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. నిర్మాణ రంగం 250 సెక్టార్లతో అనుసంధానమైనందున ఎక్కువ మంది ఉపాధి పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ రంగంలో విశాఖను మరింత అభివృద్ధి చేసేందుకు బిల్డర్లు కృషి చేయాలని కోరారు. ఈ ఎక్స్‌పోలో 50 స్టాల్స్ ద్వారా నిర్మాణ రంగంలో వినియోగించే అనేక రకాల ఉత్పత్తులను ప్రదర్శించారు. వీటిని వీక్షించేందుకు వ్యాపారులు, వినియోగదారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ నెల 18వ తేదీ వరకు ఈ ఎక్స్‌పో కొనసాగుతోందని, ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వీక్షించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఏఐ రాష్ట్ర వైస్ చైర్మన్ ఏ.కాశీవిశ్వేశ్వరరావు, నేవీ చీఫ్ ఇంజనీర్ దినేష్ అగర్వాల్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, విశాఖ చైర్మన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యోగా ఉపకేంద్రాల సంఖ్య పెంచుతాం



వీసీ ప్రసాద రెడ్డికి జ్ఞాపిక బహూకరిస్తున్న సిద్ధయోగి స్వామి అంతర్ముఖానంద

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయానికి అనుబంధంగా పనిచేస్తున్న యోగా ఉపకేంద్రాల సంఖ్యను గణనీయంగా పెంచనున్నట్టు ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ‘విశ్వ సంక్షేమం కోసం యోగ చైతన్యం’ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ యోగా తత్వాన్ని విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. రానున్న కాలంలో ఏయూకు అనుబంధంగా వందకుపైగా ఉపకేంద్రాలను ఉత్తరాంధ్ర జిల్లాలలో ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలకు సైతం యోగాను చేరువ చేస్తామన్నారు. ఆర్ట్స్,కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు మాట్లాడుతూ మనల్ని సంస్కరించే ప్రక్రియగా యోగా నిలుస్తుందని, గురువులు దీనికి మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్ భానుకుమార్ మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగా భాగం కావాలని సూచించారు. యోగా విభాగాధిపతి ఆచార్య కె.రమేష్ బాబు మాట్లాడుతూ యోగ చైతన్యం అనుభూతి పొందాలని సూచించారు. సదస్సుల నిష్ణాతులైన 16 మంది ప్రసంగాలను ఏర్పాటు చేశామన్నారు. 490 మందకిపైగా ప్రతినిధులు సదస్సులో ప్రత్యక్ష, పరోక్ష విధానాలలో పాల్గొంటున్నారన్నారు. అనంతరం సదస్సులో రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి స్వసంవేద్యానందజీ మహారాజ్ యోగ చైతన్యంపై, సిద్ధయోగి డాక్టర్ అంతర్ముఖానంద స్వామి అంతర్ముఖ ప్రాణాయామంపై, డాక్టర్ గణేష్ రావు క్షేమం కోసం యోగా అనే అంశాలపై ప్రసంగించారు. అనంతరం అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో చిట్టూరి శ్రావణి, గురునాథ్, ఆచార్య కృష్ణయ్య, డాక్టర్ తులసి రావు,వి.మురళీ కృష్ణ, యోగా కేంద్రం సిబ్బంది, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

మరణించినా.. అతని చూపు సజీవం



భాస్కరరావు కార్నియాను సేకరిస్తున్న వైద్యుడు

మల్కాపురం: తను మరణించినా.. తన కళ్లు మరొకరిలో వెలుగులు నింపాలని భావించాడు. ఆయన ఆకాంక్షను కుటుంబ సభ్యులు నెరవేర్చారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి ప్రాంతానికి చెందిన వై.భాస్కరరావు దుస్తుల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా.. భాస్కరరావుకు గురువారం గుండెలో నొప్పి రావడంతో గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యం చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించాలని సూచించారు. వెంటనే కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మరణం అనంతరం తన కళ్లను దానం చేయాలని భాస్కరరావు కుటుంబ సభ్యులకు సూచించారు. ఆయన కోరికను వారు నెరవేర్చారు. సమాచారం అందుకున్న జిల్లా అంధత్వ నివారణ సంఘం ప్రతినిధులు భాస్కరరావు కార్నియాను సేకరించారు.

వడదెబ్బతో పారిశుధ్య కార్మికుడి మృతి



నాగేశ్వరరావు(ఫైల్)

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు పరిధిలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న పి.నాగేశ్వరరావు వడదెబ్బతో మృతి చెందాడు. ఉదయం విధులకు హాజరైన నాగేశ్వరరావు మధ్యాహ్నం సమయంలో పని ముగించుకుని వెళ్తున్న సమయంలో గోపాలపట్నం మౌర్య సినిమా హాలు వద్ద పడిపోయారు. ఇది గమనించిన స్థానికులు గోపాలపట్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమాచారంతో 108 సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. నాగేశ్వరరావును పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. తోటి పారిశుధ్య సిబ్బంది మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వడదెబ్బ తగలడంతో మృతి చెందినట్లు వారు చెబుతున్నారు.

అంధ బాలికల పాఠశాలలో ప్రవేశాలు

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ ఎం.మహేశ్వరరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల వయసు ఉండి.. కనీసం 40 శాతం అంధత్వం గల బాలికలు అర్హులన్నారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు 46 సీట్లను భర్తీకి చేస్తామని తెలిపారు. ఉచిత వసతి, పౌష్టికాహారం, ఆధునిక బ్రెయిలీ సామగ్రితో విద్య, కంప్యూటర్ పరిజ్ఞానంతో ప్రత్యేక శిక్షణ ఉంటుందని, వివరాలకు 90144 56753, 77805 24716ను సంప్రదించాలని కోరారు.

అవంతిలో అందుబాటులో ఎంసీఏ కోర్సు

తగరపువలస: చెరకుపల్లి అవంతి విద్యాసంస్థల్లో ఈ ఏడాది నుంచి ఎంసీఏ కోర్సును అందుబాటులో ఉంచినట్టు విద్యా సంస్థల డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ తెలిపారు. ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులై సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడాలనుకునే వారికి ఇది మంచి అవకాశమన్నారు. ఏపీ ఐసెట్‌లో అర్హత సాధించి ఈ కోర్సులో చేరవచ్చని సూచించారు.

దులీప్ ట్రోఫీకి మనోళ్లు ముగ్గురు

భరత్, రికీబుయ్, శశికాంత్ ఎంపిక



హనుమ విహారి



భరత్



రికీబుయ్



శశికాంత్

విశాఖ స్పోర్ట్స్: ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీకి నలుగురు ఆంధ్రా ఆటగాళ్లు సౌత్‌జోన్ జట్టులో స్థానం సంపాదించారు. టెస్ట్ ఫార్మాట్‌లో జరిగే ఈ ట్రోఫీకి ఎంపికైన జట్టులో ముగ్గురు విశాఖ ఆటగాళ్లు ఉండటం విశేషం. ఈ ట్రోఫీ కోసం దేశంలోని ఆరు జోన్ జట్లు పోటీ పడనున్నాయి. సౌత్ జోన్ జట్టుకు ఆంధ్రా క్రికెటర్ హనుమ విహారి నాయకత్వ బాధ్యతలు వహించనుండగా వికెట్ల వెనుక కె.ఎస్ భరత్ నిలవనున్నాడు. బ్యాటర్‌గా రికీబుయ్ మెరుపులు మెరిపించేందుకు సిద్ధమవుతుండగా.. శశికాంత్ నిప్పులు చెరిగే పేస్‌తో చెలరేగనున్నాడు. జూన్ 28 నుంచి దులీప్ ట్రోఫీ ప్రారంభం కానుండగా టైటిల్ పోరు జూలై 12 నుంచి 16 వరకు జరగనుంది. నిరుటి ఫైనలిస్టులు వెస్ట్, సౌత్‌జోన్ నేరుగా సెమీస్‌లో తలపడనుండగా మిగిలిన నాలుగు జోన్ జట్లు క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్ లాడి తొలి రెండు జట్లు సెమీస్‌కు అర్హత సాధించనున్నాయి.

జాతీయ జట్టు దిశగా అడుగులేసేందుకు దులీప్ ట్రోఫీ ఆటగాళ్లకు అందివచ్చే అవకాశం. 1961 లోనే ప్రారంభమైన ఈ ఫస్ట్ క్లాస్ క్రికెట్ టోర్నీలో చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఆడిన వారున్నారు. ప్రస్తుతం దక్షిణ జోన్ జట్టుకు ముందుకు నడిపించనున్న హనుమ విహారితో పాటు భరత్, రికీబుయ్ జాతీయ జట్టుకు ఆడిన వారే. శశికాంత్ అండర్–19 వరల్డ్ కప్ సాధించిన భారత్ జట్టులో సభ్యుడే. దేశంలోని ఆరు జోన్ జట్లు ఈ ట్రోఫీ కోసం పోటీ పడుతుండగా డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో వెస్ట్‌జోన్ బరిలోకి దిగనుంది. ప్రస్తుత సీజన్‌లో రౌండ్ రాబిన్ పద్ధతిలో లీగ్ జరగనుండగా నాకవుట్‌లో టైటిల్ పోరు జరగనుంది. 2014 వరకు ఐదు జోన్ జట్లు నాకవుట్ పద్ధతిలో పోటీపడగా.. తొలినాళ్లలో లీగ్ పద్ధతిలో పోటీపడేవి. సౌత్, వెస్ట్, ఈస్ట్, నార్త్ జోన్లతో పాటు సెంట్రల్ జోన్ ఆడేది. ప్రస్తుత సీజన్‌లో నార్త్ ఈస్ట్ జోన్‌తో కలిసి ఆరు జట్లు పోటీకి సిద్ధమవుతున్నాయి.

సౌత్‌జోన్‌లో...

ప్రతీ జోన్‌లో రంజీ ట్రోఫీ ఆడిన ఆటగాళ్లను ఆయా రాష్ట్రాల జట్ల నుంచి తీసుకుంటారు. ఇందులో భాగంగానే సౌత్‌జోన్‌లో ఏపీ జట్టుతో పాటు గోవా, హైదరాబాద్, కర్నాటక, కేరళ, తమిళనాడుకు ఆడిన ఆటగాళ్లు ఉన్నారు. సౌత్‌జోన్‌కు ఆంధ్రా ఆటగాడు హనుమ విహారి కెప్టెన్‌గా, మయాంక్ అగర్వాల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. కీపర్లుగా విశాఖ ఆటగాళ్లు రికీబుయ్, భరత్‌లను ఎంపిక చేశారు. రికీబుయ్ టాప్ ఆర్డర్ బ్యాటర్‌గానే సత్తా చాటే అవకాశాలుండగా.. భరత్ వికెట్ల వెనుక నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సాయి సుదర్శన్, సమర్థ్, సుందర్, సచిన్ బెబీ, ప్రదోష్, సాయికిశోర్, కావేరప్ప, వైశాక్, దర్శన్, తిలక్‌లతో పాటు విశాఖకు శశికాంత్ జట్టుకు ఎంపికయ్యారు. వీరిలో చాలామంది ఐపీఎల్ ఆడిన వారున్నారు.

తొలి మూడు సీజన్లలో సౌత్ జోన్ ఫైనలిస్ట్

ట్రోఫీ ప్రారంభమైన 1961–62 సీజన్‌లో సౌత్‌జోన్ ఫైనల్ ఆడింది. వరసగా మూడుసార్లు ఫైనల్‌లాడినా తొలి రెండు సీజన్లలో రన్నరప్‌గానే సరిపుచ్చింది. ఇక మూడో సారి ఈ రెండు జట్లే ఫైనల్ ఆడగా డ్రాగా ముగియడంతో ఇరు జట్లను విజేతగా ప్రకటించారు. 1965–66 సీజన్‌లో సౌత్‌జోన్ విజేతగా నిలివడమే కాక వరసగా మూడు సార్లు విజేతగా నిలిచి హాట్రిక్ సాధించింది. ఇప్పటి వరకు సౌత్‌జోన్ 11 సార్లు విజేతగా నిలిచింది.

సామాజిక, ఆర్థిక అభివృద్ధితోనే దళిత జాతి అభ్యున్నతి



ఏఐఎం నాయకులను సత్కరిస్తున్న సునీల్‌కుమార్

ఉక్కునగరం: దళితులందరూ సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే.. దళిత జాతి అభ్యున్నతి సాధ్యమని అంబేడ్కర్ ఇండియన్ మిషన్(ఏఐఎం) వ్యవస్థాపక అధ్యక్షుడు, అడిషనల్ డీజీపీ పి.వి.సునీల్‌కుమార్ అన్నారు. స్టీల్‌క్లబ్‌లో శుక్రవారం 'మన వాడ–మన పంచాయతీ– మన పరిపాలన' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా ప్రసంగించారు. ప్రతీ ఒక్క దళితవాడ.. దళిత పంచాయతీగా ఏర్పడిన నాడే ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రాలు, జిల్లాలు విడిపోయినంత మాత్రాన జనం వేరు కాలేదన్నారు. ప్రతీ దళిత వాడను పంచాయతీ చేయాలనే నినాదంతో అంబేడ్కర్ ఇండియన్ మిషన్ పుట్టిందన్నారు. అనంతరం ఏఐఎం సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో కె.బత్తుల దిలీప్ కుమార్, శ్రీను, ఎ.వి.టి.టి.అప్పారావు, బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ట్రాప్‌లో పవన్

ఎమ్మెల్యే ముత్తంశెట్టి



దివ్యాంగురాలికి మూడు చక్రాల స్కూటర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మధురవాడ: రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నా పవన్ కల్యాణ్‌కు కనిపించడం లేదని.. చంద్రబాబు ట్రాప్‌లో పడి ఏదేదో మాట్లాడుతున్నాడని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సినిమా వేరు, నిజ జీవితం వేరన్న విషయాన్ని తెలుసుకోవాలని సూచించారు. జీవీఎంసీ 7వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సచివాలయం వ్యవస్థ దండగ అన్న చంద్రబాబు.. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను తన మేనిఫెస్టోలో ప్రకటించారని ఎద్దేవా చేశారు. సీఎం జగన్‌ను అర్థం చేసుకోవడానికి 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబుకే నాలుగేళ్లు పట్టిందన్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలేనికి చెందిన కె.కుమారి అనే దివ్యాంగురాలికి మూడు చక్రాల స్కూటర్ అందజేశారు.

నైపుణ్యాభివృద్ధి సంస్థ నోడల్ ఆఫీసర్‌గా వెంకటరమణ



డాక్టర్ కె.వెంకటరమణ

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ విశాఖ జిల్లా నోడల్ ఆఫీసర్‌గా కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ నియమితులయ్యారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ డిప్లమో కాలేజీలు, ఐటీఐ, స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీల్లో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణకు సంబంధించి కార్యక్రమాలను పర్యవేక్షించడానికి టెక్నికల్ ఎడ్యుకేషన్ శాఖ తరపున ఆయన్ని జిల్లా నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. ఈ మేరకు టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నోడల్ ఆఫీసర్ల బృందంలో డీటీఈ, డీఈటీ, ఏపీఎస్ఎస్‌డీసీ, సీడ్‌ఏపీ, నేక్(ఎన్ఏసీ)ల నుంచి ఒక్కొక్కరు చొప్పున సభ్యులుగా ఉంటారు. ఇలా ప్రతి జిల్లాకు ఓ నోడల్ ఆఫీసర్ల బృందం పనిచేస్తుంది. వీరందరూ సమన్వయంగా పనిచేస్తూ రాష్ట్రంలోని 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు, 84 ఐటీఐలు, 26 నైపుణ్యాభివృద్ధి కళాశాలల్లో నిర్వహించే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.

అథ్లెట్ జ్యోతికి స్వర్ణం



100 మీటర్ల పరుగులో విజేతగా నిలిచి స్వర్ణం అందుకుంటున్న జ్యోతి

విశాఖ స్పోర్ట్స్: నగర అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ జాతీయ అంతర్ రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. భువనేశ్వర్‌లో శుక్రవారం జరిగిన వుమెన్ 100 మీటర్ల పరుగును 11.46 సెకన్లలో పూర్తి చేసి స్వర్ణాన్ని అందుకుంది. ఒడిశాకు చెందిన శ్రభాని ద్వితీయ స్థానంలో, హర్యానాకు చెందిన హిమశ్రీ తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధులు జ్యోతిని అభినందించారు.

విషాదం నింపిన ప్రేమ

- తీరని వేదన మిగిల్చిన ప్రేమజంట ఆత్మహత్య



భార్య రొద్దు, కుమార్తెతో చంద్రన్న (ఫైల్)

అనంతగిరి: ప్రేమ వ్యవహారం రెండు కుటుంబాల్లో తీరని శోకం నింపింది. మండలంలోని తాడిగుడ గ్రామానికి చెందిన చంద్రన్న (33) సీమగెడ్డ గ్రామానికి చెందిన స్వాతి (17) ఆత్మహత్యకు పాల్పడటంతో ఆయా గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. వీరిద్దరూ విజయనగరం జిల్లా కొత్తవలస మండలం నిమ్మలపాలెం గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. తాడిగుడ గ్రామానికి చెందిన చంద్రన్నకు పదిహేనేళ్ల క్రితం రొద్దు అనే మహిళతో వివాహం జరిగింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో చంద్రన్న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న వాలాసి పంచాయతీ సీమగెడ్డ గ్రామానికి చెందిన స్వాతితో కొంతకాలంగా ప్రేమ వ్యవహారం సాగిస్తున్నాడు. అయితే రెండో వివాహం చేసుకునేందుకు భార్య రొద్దు అంగీకరించకపోవడంతో భార్యాభర్తలు గొడవపడుతున్నారు. ఈ కారణంగా చంద్రన్న స్వాతితో కలిసి ఉంటున్నాడని బంధువులు తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం కొత్తవలస మండలం రైల్వే ట్రాక్ వద్ద చంద్రన్న, స్వాతి ఆత్మహత్య చేసుకున్నట్టు కొత్తవలస పోలీసుల నుంచి సమాచారం అందడంతో ఇరు కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. చంద్రన్న భార్య గృహిణి. వ్యవసాయం చేసుకుంటూ సాఫీగా సాగిపోతున్న ఆ కుటుంబంలో ప్రేమ వ్యవహారం చిచ్చురేపింది. ఆత్మహత్యకు దారి తీయడంతో చంద్రన్న కుటుంబం యజమానిని కోల్పోయింది. భార్య రొద్దు, పిల్లలు కుమార్, సునీల్, సుమిత్ర, దీప్తి అనాథలుగా మిగిలిపోయారు. వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

చికెన్ (కిలో)

ఫారం ధర :	రూ.135	బ్రాయిలర్ (లైవ్):	రూ.155
		స్కిన్ :	రూ.280
		స్కిన్ లెస్ :	రూ.290

మండు వేసవిలో.. నిండు కుండలా.!

ఆరిలోవ: మండు వేసవిలోనూ ముడసర్లోవ రిజర్వాయర్ నీటితో కళకళలాడుతోంది. గతంలో మే వచ్చే సరికి రిజర్వాయర్ అడుగంటిపోయేది. 2019 మేలో పూర్తిగా ఎండిపోయి బీటలువారిన సంగతి తెలిసిందే. వేసవి వచ్చిందంటే ఆరిలోవ ప్రాంతీయులకు నీటి కష్టాలు మొదలైనట్లే.. అయితే నాలుగేళ్లుగా ఇక్కడ ఈ సమస్య కనిపించడం లేదు. రిజర్వాయర్‌లో నిండుగా నీరు ఉండటంతో.. బోర్లు కూడా బాగానే పనిచేస్తున్నాయి. ఈ ఏడాది ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికీ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయినప్పటికీ రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉంది. రిజర్వాయర్ సామర్థ్యం 170 అడుగులు కాగా.. శుక్రవారం నాటికి 163 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. వర్షాలు కురిస్తే తక్కువ కాలంలోనే ఓవర్ ఫ్లో అవుతుందని నీటి సరఫరా అధికారులు భావిస్తున్నారు. రానున్నది వర్షా కాలం కావడంతో రిజర్వాయర్‌లో నీటి మట్టం మరింత పెరుగుతుంది. వేసవిలో నీటి సమస్య తలెత్తకపోవడంతో ఇక్కడి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'గృహ కార్మికులకు అందని సంక్షేమ ఫలాలు'



సదస్సులో మాట్లాడుతున్న కనకారావు

డాబాగార్డెన్స్: దేశంలో గృహ కార్మికులకు ఎటువంటి సంక్షేమ ఫలాలు అందడం లేదని కాన్ఫడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు ఎస్.కనకారావు ఆవేదన వ్యక్తం చేశారు. కాన్ఫడరేషన్ 13వ అంతర్జాతీయ గృహ దినోత్సవం సందర్భంగా డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్రం నలుమూలల నుంచి గృహ కార్మికులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011లో సీఎఫ్‌టీయూఐ వంటి అనేక కార్మిక సంఘాలు, సామాజిక సంస్థల కృషి ఫలితంగా ఇంటర్నేషనల్ లేబర్ కన్వెన్షన్ 189 ద్వారా గృహ కార్మికులను కూడా కార్మికులుగా గుర్తిస్తూ తీర్మానం చేసిందన్నారు. ఈ చట్టం అమలైతే గృహాల్లో పని చేస్తున్న ఆరు కోట్ల మంది గృహ కార్మికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఫలితంగా మానవ అక్రమ రవాణా, గృహ హింస వంటివి తగ్గుముఖం పడతాయని అభిప్రాయపడ్డారు. సంఘం నిర్వాహక కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకురావాలన్నారు. దాసరి సురేష్‌బాబు, టీవీ రమణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పల్సస్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

సీతంపేట: పల్సస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొని.. రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ సీఈవో గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా రక్తదాన శిబిరం నిర్వహించామని, వందలాది మంది ఉద్యోగులు రక్తదానం చేయడానికి ముందుకొచ్చారని చెప్పారు. మహిళా ఉద్యోగులు కూడా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆప్ నబ్ కి ఆవాజ్ మద్దతుతో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. కోవిడ్–19 సమయంలో మహమ్మారిపై పోరాటానికి పల్సస్ తన వంతు సాయం చేసిందని గుర్తు చేశారు. విశాఖపట్నం బ్లడ్ డోనార్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.రాజ్‌కుమారి పాల్గొన్నారు.

అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు పునరుద్ధరించాలి

జీవీఎంసీ కమిషనర్‌కు జెమ్స్ వినతి



కమిషనర్‌కు తమ సమస్యలు వివరిస్తున్న సభ్యులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను ఆయన చాంబర్‌లో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ ఆఫ్ మినిస్ట్రీరియల్ సర్వీసెస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. జీవో 40 ఉద్యోగులందరికీ ప్రతి బంధంగా ఉన్నందున, దానిని సవరణ కోరుతూ ప్రభుత్వాల నుంచి నివేదిక తెప్పించేందుకు కృషి చేయాలని, జీవీఎంసీలోని అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు పునరుద్ధరణ చేయాలని కోరారు. రెవెన్యూ ట్యాక్స్ అసెస్‌మెంట్ సంఖ్యాపరంగా అవసరాన్ని బట్టి రెవెన్యూ అధికారి హోదాలో పదోన్నతికి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, చాలా కాలంగా ఖాళీగా ఉన్న టైపిస్ట్, స్టెనో టైపిస్ట్ హోదాలను జూనియర్, సీనియర్ అసిస్టెంట్ హోదాలకు బదిలీ చేసినట్లయితే మినిస్ట్రీరియల్ పోస్టులు పెరుగుతాయన్నారు. జోనల్ కార్యాలయాల్లో మరుగుదొడ్లను ఆధునికీకరించాలని, మూతపడ్డ జీవీఎంసీ క్యాంటీన్‌ను తెరిపించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జెమ్స్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, సభ్యులు అప్పలనాయుడు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారని జెమ్స్ సభ్యులు తెలిపారు.

నిర్మానుష్యంగా విశాఖ రైల్వే స్టేషన్

ప్రధాన రైళ్ల రద్దుతో ఖాళీగా ప్లాట్‌ఫాంలు



ఎప్పుడూ రద్దీగా ఉండే 8వ నంబర్ ప్లాట్‌ఫాం ఖాళీగా ఇలా..

తాటిచెట్లపాలెం: ఎప్పుడు ప్రయాణికులతో రద్దీగా ఉండే విశాఖపట్నం రైల్వే స్టేషన్ శుక్రవారం నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. విశాఖ నుంచి బయలుదేరే జన్మభూమి, సింహాద్రి, రత్నాచల్, గోదావరి, కాచిగూడ ఎక్స్‌ప్రెస్, కాకినాడ పాసింజర్, రాజమహేంద్రవరం పాసింజర్, గరీబ్‌రథ్ వంటి పలు ప్రధాన రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికుల లేక ప్లాట్‌ఫాంలు ఖాళీగా కనిపించాయి. దీంతో రైల్వే స్టేషన్ అంతా బోసిపోయింది.

విశాఖ బులియన్

24 క్యారెట్స్ (10 గ్రా.)	రూ.60,110
22 క్యారెట్స్ (10 గ్రా.)	రూ.55,100
వెండి (కిలో):	రూ.78.500

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	550.00
విజయనగరం	554.00
శ్రీకాకుళం	554.00